# షాకిరా

'షాకిరా' తెలుగు మాట కాదు. నాకు తెలుగు తప్ప మరో భాష రాదు. షాకిరా అంటే చక్కెరలాగా తియ్యనిది అన్న అర్థం నేను ఊహించుకున్నాను. ఆ పేరుగలావిడ కూడా తనని గురించి అలానే భావించుకున్నట్లుంది - ఎప్పుడూ మంచిదానిగా, గుణవంతురాలిగా, అందమైనదిగా, యవ్వనవతిగా, గొప్పింటి ఆడపడుచుగా - ఇవన్నీ తానేనని చెప్తూ ఉంటుంది నాకు. నాకేమో అంత నమ్మకం కలగలేదు. ఎదుటి మనిషి గుణాన్ని సరిగ్గా అంచనా వెయ్యగల మేధావినని నా నమ్మకం ఇప్పటివరకూ. అయినా తాను గుణవంతురాలిననీ, శుచీ, శుభ్రతా తన గుణాలనీ ఆవిడ అనుకోవడం, నాకు నిరూపించబోవడం నాకు చాలా ఉపయోగకరమైన అంశాలే గనుక తెలివిగలదాన్నయిన నేను తర్కించలేదు.

నేను కొత్తగా ఈ ఊరికి వచ్చి పనిమనిషి కోసం చూస్తున్నాను. పక్కింటి పనావిడ రజియా వచ్చి "ఈయమ్మని చూడమ్మా! ఆడ కనపడితే పిల్చుకొచ్చినాను. పెళ్లవగానే మొగుడు వదిలేశాడు. తల్లిగారింట్లో ఉండిపోయింది. తెల్సిన వాళ్లిళ్లలో ఏమన్నా పనులు చేస్తుంది, వాళ్లమ్మతో కలిసి బియ్యాలు మలుస్తుంది.... చూడండి. వాళ్ళు అట్లాంటోళ్ళు కాదు!" అన్నది. చెప్పాల్సింది చెప్పేసి మొహం పక్కకి తిప్పేసుకుంది - 'నీ తెలివి కొద్దీ నువ్వు చూసుకో. నాదేం బాధ్యత లే'దన్నట్లు. 'అట్లాటివాళ్లు' అంటే ఏమిటని అడుగుదా మనుకున్నానుగాని రజియా మొఖం పక్కకు తిప్పుకొని ఉండడంతో ఊరుకున్నాను.

గడపవారగా నిలుచున్న షాకిరా చిన్నగా నవ్వుతూ తెల్లగా మెరిసే బురఖీలోనుంచి బిడియంగా తొంగి చూసింది నా వైపు - ఆ చూపుతోనే నాకు తప్పకుండా పని చేసి పెట్టాలని నిశ్చయించుకున్నట్లు తర్వాత నాతో చెప్పింది - సన్నగా, పొట్టిగా ఉండి మంచి తెల్లని రంగులో ఉంది. మొహం ఆకలితో పీల్చుకునిపోయి ఉంది. జుట్టు తెల్లబడడానికి నాందిగా ముందర భాగం మట్టి రంగుకు తిరిగింది. వయస్సు ముప్పై అయిదు దాటి ఉంటుందని అనుకున్నాను. ఇదంతా సరైన తిండి లేకపోవడమనీ, నిజంగా తనది చిన్న వయసనీ తర్వాత చెప్పింది షాకిరా. తెల్లగా మెరిసే బురఖీ తన

ఒదినెదనీ, ఆమె నడిగి తెచ్చుకున్నాననీ చెప్పింది.

దుమ్ము కొట్టుకొని ఉన్న సామాన్లనీ, చికాగ్గా ఉన్న ఇంటినీ ఒకసారి పరికించి చూసుకుని షాకిరాని పనిలో చేరమన్నాను.

షాకిరాని వదిలేసిన మొగుడు పోలీసాఫీసరు. ఇరవై ఏళ్ల క్రిందట ఇంట్లో ఉన్న ఇరవై తులాల బంగారం, పదివేల డబ్బూ మొత్తం జమ చేసి కట్నంగా ఇచ్చి పెద్దకూతురి పెళ్లి ఘనంగా చేసింది షాకిరా తల్లి. బంగారమూ, డబ్బూ తీసేసుకుని రెండో నెలలోనే పుట్టింటికి పొమ్మన్నాడు పోలీసాఫీసరు. షాకిరా పోలేదు. 'పొగరుబోతు తిక్క' అంటూ బూతులు తిట్టాడు. షాకిరా ఓర్చుకుంది. ఇంకో రెణ్నెల్లు చూసి, మీద కిరసనాయిలు చల్లి అగ్గిపుల్ల ముట్టించబోతే వీధిలోకి పరుగెత్తి, అట్నుంచటే పుట్టిల్లు చేరానని చెప్పింది. ఆ వెనువెంటనే అతనికి వేరే సంసారం, పిల్లలూ ఏర్పడ్డారు.

షాకిరా డబ్బు, బంగారం తిరిగి రాలేదు. పోలీసాఫీసర్ని ఎవరూ గట్టిగా అడగలేకపోయారు. "ఆయన దగ్గర నాలుగు నెల్లున్నానేమో!" అంది షాకిరా సిగ్గుపడిపోతూ. "నా కొడుకు - సవతి కొడుకు - డాక్టరు చదువుతున్నాడు. అందంగా ఉంటాడు" అని చెప్పింది... అప్పణ్ణించీ ఈ ఊళ్లోనే డబ్బున్న దూరపు బంధువుల ఇంట్లో ఉదయం నుంచీ సాయంత్రం వరకూ చిన్న పనీ, చితక పనీ చేస్తూ ఉండిపోయింది. వాళ్లూ మిగిలిపోయిన అన్నం, చారులూ, పాతబట్టలూ ఇస్తూ వచ్చారు. ఒకటో తేదీన జీతం - నిజం డబ్బులు - చేతికొచ్చిన రోజున - వాటిని సంతోషంగా చూస్తూ ఈ విషయాలు చెప్పింది... షాకిరా ఒకరింట్లో పాచి పనికంటూ రావడం ఇదే మొదలు. "ఏమయ్యా! చెల్లెలిని పనికి పంపి సంపాదిస్తున్నావే" అని వీధివాళ్లంతా వాళ్లన్నని అడగరూ! లోకం చెడ్డది. "నేను బురఖీ ఏసుకుని తలొంచుకుని మనిషి ముఖం చూడకుండా రోడ్డు చూసుకుంటూ పక్క పక్కలు నడిచొస్తుంటే మొగాళ్లంతా చెప్పుకుంటారు - ఆ మహాతల్లిని చూడు! మహా పతివ్రేత! ఆడాళ్లంతా ఆయమ్మ కాళ్ల కింద దూరిపోవల్సిందే - అంటారు" అని చెప్పింది. ఈ కాళ్ల కింద దూరడం ఏమిటో అర్థం కాకపోయినా షాకిరా మొఖం చూస్తే అదేదో గౌరవప్రదమైన విషయం అని తెలుసుకున్నాను. ఆవిడ రోడ్డులో నడవడం మేడ పై నుంచీ చూశాను. తెల్లటి బురఖీని తగుమాత్రంగా తొలగించి, రోడ్డుకిరువైపులా దుకాణాల ముందు కూర్చున్న మనుషుల్ని ఓరగా చూస్తూ, మెల్లగా అడుగు తీసి అడుగు వేస్తూ, రాజహంసలాగా నడుస్తుంది. అలా నడుస్తూ ఈ సంభావణలన్నీ ఊహించుకుంటుంది కాబోలు అనుకున్నాను. ఆత్మాభిమానం ఉండాల్సిందే గదా!

"మీ ఇల్లంత సుబ్రం నేనెక్కడా జూళ్లేదు. బలే సుబ్రం" అన్నది ఒక రోజున. ఆ మాట నిజమేనన్నట్లు తలూపి ఊరుకున్నాను. "ఇక్కడ ఈ ఊళ్లో ఎవరిల్లూ ఇట్లా ఉండదు!" అన్నది ఖచ్చితంగా... "అవునా! ఎందువలన? ఎందుకుండదు?" అన్నాను. "ఆ! ఇక్కడ

ఆడాళ్లు ఆ వంట జేసిపారేసి వాకిటి ముందు ముచ్చట్లకూర్చుంటారు! ఇంటి సుబ్రం చూడరు!" అన్నది. "అట్లానా?" అని ఊరుకున్నాను. 'ఎంత అవివేకి!' అన్నట్లు చూసింది నన్ను. అసలు విషయం నేను గ్రహించనందుకు చాలా చికాకుపడుతూ "మన ఇల్లు, మన దొడ్డి నేను ఎంత సుబ్రంగా పెడుతున్నాను! ఎక్కడా బెంజి లేకుండా సుబ్రం చేసేస్తున్నాను" అన్నది విసురుగా కసురుతూ. మా అల్యూమినియం సామాన్లకు 'పుళ్లు' ఉండవు... చాలామంది వస్తువులకు పుళ్లుంటవి - షాకిరా రోజూ అన్నీ రుద్ది 'సుబ్రం' చేస్తున్నందువలననే!

'ఈ ఇల్లు చాలా మంచిది. ఇక్కడ దేవుడున్నాడు' అనేది అప్పుడప్పుడూ. చాలా ఇళ్లు మంచివి కావు. దయ్యాలుంటవి. అక్కడ కాలు పెడితేనే జబ్బులు పట్టుకుంటవి. ఈ విషయాలు ఆమె అనుభవం మీద చెప్పేవేగాని ఉట్టి మాటలు కావు! ఏదైనా పని మీద పక్కింటికో, పొరుగింటికో వెళ్లినప్పుడు 'నాకు దిష్టి తగిలింది. వాంతులు, విరేచనాలు, తల నొప్పి, గుండె నొప్పి వచ్చినై' అంటూ చాలా బాధపడేది. నేనూ, నా పిల్లలూ కూడా ఎవరింటికైనా వెళ్లడం షాకిరాకి ఇష్టం ఉండేది కాదు. మా ఇల్లూ, షాకిరా మనసూ, దేవుడూ కలగలసి ఎట్లాగో పీట ముడి పడిపోతున్నవి!

ఇరుగింటి పిల్లలు అరుస్తూ ఆడుతున్నారనో, పొరుగింటి పిల్లలు మా మొక్కలు పీకబోతున్నారనో, పక్కింటివాళ్లు మా కొళాయిలో నీళ్లు పట్టుకోనున్నారనో ఏదో కారణానికి ఇరుగు పొరుగుల మీద షాకిరా అరుపులు ఎక్కువవుతున్నవి. ఈ ఇంటి అజమాయిషీ అంతా తనదేనన్న భ్రమలోనికి వచ్చేస్తున్నది! నాకు వంట చెయ్యడానికి వేరే మనిషి కావాలని అన్నప్పుడు చాల హడావుడి చేసింది. వంట చాలా సులువైన పనసీ, అన్నీ తనే చేసేస్తాననీ, వంట మనుషుల వలన చాలా అనర్థాలు జరుగుతాయనీ, ఈ ఊరి మనుషులు మంచివాళ్లు కాదనీ, వంటకని ఇంట్లో కాలు పెట్టి సవతులై కూర్చున్న సందర్భాలు అనేకం ఉన్నాయనీ - చాలావిధాలుగా నచ్చచెప్ప జూసింది. మంచి వంటమనిషిని తనే వెదుకుతున్నాననీ, ఎవరో ఉన్నారనీ చెపుతూ కొంతకాలం గడిపింది- చివరకు రాజమ్మ వంటకు కుదిరేవరకూ!

సీతాఫలాల కాలం రానీ, మామిళ్ల కాలం రానీ, కర్బూజాలు రానీ, కమలాలు రానీ-ఇంట్లో కాలు పెట్టగానే దండకం మొదలెడ్తుంది - "ఆ అంగళ్ల ముందూ, వాకిళ్లలోనూ కూర్చుని ఆడాళ్లు సీతాఫలాలు తిని తినీ సస్తారు! అన్ని పళ్లా! తిని తినీ కాలవల నిండా పూంచుతారు. ఛీ... ఛీ... అవి లేకపోతే అంగట్లో పప్పులూ, బొరుగులు నోట్లోకి ఎగరేసుకుంటూ ఉంటారు! అమ్మో! ఏం తిండి!... దానికి తగ్గట్టే ఏం రోగాలు! కొందరు ఉప్పు దినిసాయరు. కొందరు సక్కెర దిని సాయరు... మాకైతే ఈ తిళ్లు కాదు! అంత ఊరు బిండి నూరుకుని చింత చారు జేసుకుని తింటాం. ఏ రోగం రాదు! ఆ పప్పులు

మేమెక్కడ కొంటాం. ఆ పళ్లు మే మెక్కడ తెస్తాం?" కాలాన్ని బట్టి పండు పేరు మారుతుంది. విషయం మాత్రం ఇదే. ఏ పళ్లయినా ముమ్మరంగా మార్కెట్‌లోకి రాగానే ఇదే వృత్తాంతం వినడం నాకు అలవాటై పోయింది...

ఇవాళా కర్మ్మజాల దండకం చదువుతూ రోజూలాగే చీపురు పట్టుకుని ముందు వరండా ఊడ్చడానికి వెళ్తున్నది. మంగలిని రమ్మన్నాం గనక ఆ పనయ్యాక ఒక్కసారే ఊడ్చవచ్చని చెప్దామని అనుకున్నాను. "షాకిరా! ఇవాళ వరండా ఇప్పుడే ఊడ్చకు..." ఇంకా నా మాట పూర్తికాకుండానే, తన దండకం ఆపి, ఆవేశంగా 'అహహ... నే నెందుకూడుస్తా?... ఊడ్చను... ఊడ్చను... నాకేం పనీ...' ఆపకుండా వాగుతూనే ఉంది. ఏం అర్థం చేసుకుందో మరి. మంగలిని రమ్మన్నానని చెప్పబోయాను కాని నా మాట పట్టించుకోకుండా అరిగిపోయిన రికార్డులా అంటూనే ఉంది ఏమిటేమిటో ఇక ఇది పనిగాదని "ఒక్క నిముషం ఆపు!" అన్నాను గట్టిగా. "ఆ వరండాతో నాకేం పని?" అన్నది మళ్లీ. "నా మాట వింటావా, లేదా? కాసేపు నోర్మూయ్యి" ఓర్పు పోగొట్టుకొని పెద్దగా అరిచాను. అప్పుడు కొంచెం గొంతు తగ్గించింది. 'అట్లనేనమ్మ అట్లనే! మీరు నోర్మూయ్యమంటే మూస్తా! తల్లి! మీరు తల్లి గిట్లనే నేననుకుంట! అందరితో కూడ చెప్తున్న... మా ఈదిలో ఎవురన్నా అడగండి... ! నాకు మహా తల్లి దొరికింది... ఆయమ్మ దేవత అని... మా తమ్ముడు కూడా నాతో గట్టిగా జెప్పినాడు. ఆయమ్మని వదలొద్దని' చెప్పుకుపోతూనే ఉంది. ఆ గొంతు తగ్గినందుకు 'అమ్మయ్య' అనుకున్నాను. "నిజమేలేగాని ఇవాళ మంగలొస్తున్నాడు... వచ్చి వెళ్లాక ఒక్కసారే శుభ్రం చేసుకుందాం... రోజూలాగా ముందుగా ఊడవకు" అన్నాను. షాకిరా శాంతించింది. "సరే, మంగలి వెళ్లినాక ఊడుస్తాలేమ్మా!" అని నెమ్మదిగా లోపలికి వెళ్లిపోయింది. 'ఈ మాటే మొదట్లోనే అనేసి ఉంటే ఎంత బాగుండేది! దాని మనసులో ముళ్ల కంపలున్నాయ్. తిక్క దయ్యం!' అనుకున్నాను. ఇటువంటి మనిషిని భరించవలసి వచ్చినందుకు నా మీద నాకే జాలి కలుగుతుంది చాలాసార్లు...

షాకిరాకి పాతికేళ్ల వయస్సుకి పై బడ్డ తమ్ముడున్నట్లు చెప్పింది. బలహీనత వల్ల పనులు చెయ్యలేడు. సంతలో కూర్చుని చేసే వ్యాపారాల్లాంటి తేలిక పనులు దొరికినప్పుడు చేస్తాడు. తగిన వారెవరూ పిల్లనిస్తామని రానందున పెళ్లి కావడం లేదు. ఒకసారి ఆ బాషా మా వీధిలో వెళ్తుంటే గర్వంగా చూపించింది. బక్కగా, పొడుగ్గా ఉన్నాడు. జుట్టు సగం నెరిసిపోయింది. షాకిరాకి అతను రాజా, దేవుడూను. వాడికి పెళ్లయి ఒక ఇంటి వాడు కావాలని చాలా మొక్కుబళ్లు చేసుకున్నట్లుగా చెప్పింది. నాకు ఏదైనా పై పని చేసి పెట్టినప్పుడు నేను రూపాయో, రెండో ఇచ్చినా తీసుకెళ్లి తమ్ముడి చేతి ఖర్చుల కిచ్చానని చెప్పేది. పండుగలకు నేను ఇచ్చిన స్వీట్లు, పులిహోరా, పాయసం

తను తినకుండా తమ్ముని కిష్టమని, ఇంటికి తీసుకెళ్లేది... అంత వయసు వచ్చినవాడు అక్కకు పెట్టాలిగాని ఇలా పీక్కు తినడం బాగాలేదని నేననుకున్నాను...

ఒక రోజున 'మా తమ్ముడు మిమ్మల్ని సూసినాడంట... ఏమో అనుకున్నానుగాని ఆయమ్మ లచ్చిందేవి! లచ్చిందేవి లాగున్నది' అన్నాడని చెప్పింది - ఆనందంగా - నా కేదో కిరీటం పెడ్తున్నట్లు! "లచ్చిందేవా? ఎవరావిడా?" అన్నాను అమాయకంగా ముఖం పెట్టి. బుద్ధి తక్కువ వాళ్లని చూసినట్లు తిరస్కారంగా చూసింది. 'లచ్చిందేవి! నారాయనమూర్తి భార్య!' అన్నది ఆకాశానికేసి కళ్లు తిప్పి. 'ఏ నారాయనమూర్తి!' అన్నాను. నా వేపు అనుమానంగా చూసింది. "దేవత! దనలచ్చిమి!" అన్నది. "ఓహో! ఆవిడా! నా దగ్గర డబ్బున్నట్లుంది అన్నాడా నీ తమ్ముడు?" అన్నాను. ఆ తమ్ముడి గురించి నాకేమీ సదభిప్రాయం లేదు మరి. 'మీ డబ్బుల్సంగతి మాకెందుకమ్మా? గుణం కావాలిగానీ" అనేసి వెళ్లిపోయింది.

కొన్నాళ్లకి కిందపడ్డ చిల్లర డబ్బులు నా చేతికి రావట్లేదని గ్రహించాను. నిర్లక్ష్యంగా పడేసుకోవడం నాదే తప్పు. తర్వాత హేంగర్స్‌కి తగిలించిన చొక్కా జేబుల్లో డబ్బులుంచకుండా జాగ్రత్తపడాల్సి వచ్చింది. షాకిరా తమ్ముడికి చేతి ఖర్చులు అవసరాలు ఎక్కువవుతున్నవి. ఎవరో పెళ్లి కూతుర్నిస్తామని వచ్చారు. మంగలి దగ్గర షేవింగ్ చేసుకోవాలన్నా, జుట్టుకు రంగేసుకోవాలన్నా, టీ తాగాలన్నా, సినిమాలకి వెళ్లాలన్నా చేతిలో డబ్బులుండాలి గనుక తన జీతం మొత్తం తమ్ముడికే ఇచ్చేస్తున్నానని చెప్పింది.

ఒక రోజున నా కొడుకు చొక్కా ఉతికింది. "నా జేబులో ముప్పై రూపాయలుండాలి. తీశావా?" అనడిగాడు బాబు. ఈసారి నేను ఊరుకోలేదు. షాకిరాని గట్టిగా అడిగాను. మాటపడడం ఆవిడ కలవాటు లేదు. రెండు రోజులు మొహం మాడ్చుకుని, గొణుక్కుంటూ, సణుక్కుంటూ ఉండిపోయింది. మూడో రోజున బాబు షర్టు ఉతికి, ఆరేసి ముప్పై రూపాయలు తెచ్చి నా చేతికిచ్చింది. "బాబు జేబుల్లో ఉన్నై" అన్నది ముక్తసరిగా. పక్కింటి సుగుణమ్మగారు "మీ షాకిరా నిన్న ముప్పై రూపాయలు ఇస్తావా, లేదా అని నా పీక మీద కూర్చుని అప్పుగా పట్టుకెళ్ళింది. ఏంటో అర్జెంటు?" అన్నప్పుడు కొంత చిక్కుముడి విడినట్లయింది. ఆ తరువాత షాకిరా కోలుకోవడానికి నెల రోజులు పట్టింది!

అప్పట్లోనే మా ఇంట్లోకి రాజమ్మ వచ్చింది. ఈ రాకతో షాకిరా ఉత్సాహం చప్పబడిపోయింది. ఆ వెంటనే ఆమె తమ్ముడు బాషాకి పెళ్లయింది. దాంతో షాకిరా చాలా రోజులు పిచ్చిదే అయిపోయింది. ఊరికెనే కుళ్లి కుళ్లి ఏడ్చుకునేది. 'పెళ్లి వాళ్లు నన్ను సరిగ్గా మర్యాద చెయ్యలేదు. పెళ్లికి సరిగా పిలవలేదు', 'మొగుడొదిలేసినదాన్నని, రాక్షసినని అన్నారు.'

"నా తమ్ముడు నా పక్క ఒక్క మాట కూడా మాట్లాడలేదు..." "మా అమ్మ కూడా... వాడినన్నా సుఖంగా ఉండనియ్యవే అన్నది!" రోజుకో కారణంతో అగ్నిపర్వతం బద్దలైనట్లుగా ఏడ్చేది... "ఇహ నే నా ఇంటికి పోను! మీ ఇంట్లోనే పని చేసుకుని ఉండిపోతా... మీ ఇంట్లో నీళ్ల పోసుకుంటా... ఆ దర్గాలో సేవ చేసుకుంటూ... అదిగో, మీ వరండాలో పడుకుంటా!" అన్నది.

ఒక రోజున చచ్చిపోతానని వాళ్లింట్లో నుంచి పారిపోతుంటే ఆ వీధిలో వాళ్లు పట్టుకొచ్చారని తెలిసింది. అయినా మా ఇంట్లో ఉండు అనలేకపోయాను. ఎవరు చేసిన కర్మ వారనుభవిస్తారు! కట్టుకున్న మొగుడు అఖ్ఖర్లేదనుకునేట్లుగానూ, తోడుగా పెరిగిన తమ్ముడూ... ఆఖరికి కన్న తల్లి కూడా ఆక్షేపించాల్సిన గుణంతోనూ పుట్టింది...! ఆవిడ ఏడుపు చూసినా నాలో వీసమంత సానుభూతి కూడా కలుగలేదు. నే నిచ్చే జీతం డబ్బుల కోసం మాత్రమే ఈ పని చేస్తున్నదిగాని నా మీది అభిమానంతో కాదు గదా! నేనూ నా పని చేసుకోలేను గనుక డబ్బులు పారేసి చేయించుకుంటున్నానేగాని ఆవిడే కావాలన్న అభిమానంతో కాదుగదా... నాకూ, ఆవిడకూ వేరే సంబంధం ఎక్కడుంది? అనుకున్నాను... మరదలు వచ్చాక రాత్రిళ్లు దర్గాలో పడుకుంటున్నాననీ, అక్కడ చలిగాలికి జలుబూ, జ్వరమూ వచ్చాయని చెప్పింది... తర్వాత ఏ విషయమూ చెప్పడం మానేసింది.

నా కొడుక్కి జ్వరం ఉధృతంగా వచ్చింది. డాక్టర్లు ఇదమిత్థమని చెప్పలేక పోతున్నారు. నాకు మతి తిన్నగా ఉండని సమయం అది. నెల ఖర్చుల కోసం బాంక్ నుంచి తెచ్చిన వెయ్యి రూపాయలు కనిపించలేదు. పది వంద రూపాయల నోట్ల కట్ట - చేతిలోకి తీసుకున్న విషయం గుర్తుంది. కాని తర్వాత ఎక్కడ పెట్టాను, ఏమి చేశానన్న విషయం ఎంత ప్రయత్నించినా గుర్తులోకి రాలేదు... ఇల్లంతా వెదికాను... నా కొడుకు తేటబడ్డాక తీరుబాటుగా వెతికాను. నేను మామూలుగా దాచే చోట్లన్నీ క్షుణ్ణంగా వెదికాను. డబ్బు ఇంట్లో ఎక్కడా లేదని నిర్ధారించుకున్న తర్వాత షాకిరాని అడిగాను. నన్ను కోపంగా, చీదరగా చూసింది. ఆ డబ్బు తాను తియ్యలేదని దేవుడి సాక్షిగా తల మీద కొంగు కప్పుకొని దర్గా ముఖంగా తిరిగి మరీ చెప్పింది - ఆ చెప్పడంలో ఎంత చికాకు - ఆవిడ సొత్తు నేను తీసుకున్నంత!

మరి డబ్బు ఏమైనట్లు? షాకిరా ఇదివరలో ఒకసారి మా ఇంట్లో డబ్బు తీసిందని నాకు రుజువుగా తెలుసుగదా! ఎన్నోసార్లు కిందపడ్డ చిల్లర డబ్బులు దాచేసుకుందిగదా. అందువలన ఇదీ ఆవిడ పనే అయి ఉండాలి అని నిర్ణయించుకున్నాను. పోలీసులతో చెప్తానన్నాను బెదిరించాలని.

షాకిరా భయపడిపోయింది. డొక్కలు ఎగిరిపడేట్లు ఏడ్చింది. ఏడుపు ఆపి నాకు దణ్ణం పెట్టింది. "నన్ను పోలీసులు పట్టుకెళ్తే ఇక నన్ను మా ఇంట్లోకి రానివ్వరు. మా

చెల్లెలి పిల్లలకు పెళ్లిళ్లు కావు. మా చెల్లెల్ని మరిది ఒదిలేస్తాడు... మరదలు నా తమ్ముణ్ణి ఈ ఊళ్లోనే లేకుండా పిల్చుకెళ్లిపోయింది'' అన్నది నిస్పృహ నిండిన గొంతుతో. ఆ డబ్బు తాను తీసి ఉంటే తర్వాత ఇస్తానని చెప్పుకోవాలి. తియ్యకుంటే అడిగినందుకు తగూలాడాలి. ఈ ప్రవర్తన నాకు అర్థం కాలేదు. ఇంతకీ ఆ డబ్బు తీసిందా, లేదా? ఏమీ నిర్ణయించుకోలేకపోయాను. మళ్లీ వెక్కిళ్లు పెట్టి ఏడవడం మొదలుపెట్టింది. ''నీవే తీశావని నాకు రుజువేమిటి? నీ బ్రతుకెందుకు పాడు చేస్తాను? ఏడవకు'' అన్నాను.

తర్వాత డబ్బు దొరికిందా అని అడిగింది. లేదన్నాను. అప్పుడప్పుడుగా తనంత తానే నాలుగు రకాల శకునాలు అడిగొచ్చింది. ఒకసారి పక్కింటి సుగుణమ్మగారే తీశారనీ, ఒకసారి బయటివాళ్లు తీశారనీ, రెండుసార్లు వంటమనిషి రాజమ్మ తీసిందనీ ఖచ్చితమైన వర్తమానాలు తెచ్చింది. నేను ఉదాసీనంగా ఉండడంతో తనూ ఆ విషయం వదిలేసింది క్రమంగా. కానీ ఆ దొంగతనం నీడ ఆవిడ నుంచీ తొలగిపోలేదు.

ఇప్పుడు షాకిరా చాలా మారిపోయింది. రోడ్డులో తలొంచుకుని తన దారిన తాను వెళ్తుంది. రాజహంసలాగా నడవదు. తనలో తాను గొణుక్కుంటుండే తప్ప మాట్లాడడం దాదాపుగా మానేసింది... ప్రతిరోజూ క్రమం తప్పకుండా శ్రద్ధగా చేసే పని ఒకటుండేది - తన పనంతా అయిపోయాక మొహానికీ, చేతులకీ, పాదాలకీ బాగా సబ్బు పట్టించి రుద్ది, రుద్ది, కడిగి, గట్టిగా కొంగుతో తుడిచి కొంత మెరుపూ, తళతళా తెప్పించి, మెరుస్తూ... బురిఖీ వేసుకుని వెళ్లిపోతుండేది. నేను డబ్బు పోయిందని అడిగినప్పుడు ఈ కార్యక్రమం కూడా ఆగిపోయింది.

క్రమంగా షాకిరాకి ఈ పని మీద, ఈ ఇంటి మీద, నా మీద తిరస్కారం ఏర్పడుతూ వచ్చింది. బహూశా ఈ ఇంట్లోంచి కూడా దేవుడు వెళ్లిపోయాడనీ, ఇంట్లో దయ్యాలు తిరుగుతున్నాయనీ చెప్పుకుంటూ ఉంటుంది! జీవితం మీద, ప్రపంచం మీదా ఉన్న ద్వేషమే ఇటు తిరిగింది... ఒకసారి ఆవిడ నాలుగు రోజులు పనిలోకి రాకపోయేసరికి నేనూ కొత్త పనిమనిషిని ఏర్పాటు చేసుకున్నాను. ఆ తర్వాత షాకిరా మా ఇంటికి రాలేదు.

ఆరు నెలలు గడిచాయి... ఒక రోజున ఎప్పుడో సగం చదివిన పాత నవలను తీసుకుని కూర్చున్నాను. 'ధరమం తల్లీ' అన్న కేక వినిపించింది. వాకిట్లో కుష్ఠు భిక్షగాడు వేళ్లూడిపోయిన చేతిని పైకెత్తి చూపిస్తూ నవ్వుతూ నిలుచున్నాడు. ప్రతి శనివారం వచ్చేవాడే. ఆ చేతిని అట్లా చూపిస్తాడెందుకూ అనుకున్నాను చికాకుగా. తనకా జబ్బు రావడంతో ప్రపంచం తనకేదో బాకీ పడిపోయినట్లూ, భిక్ష అడగటానికి తనకు హక్కు ఏర్పడినట్లూ ఉంది వాడి వాలకం! తాను చేసుకున్న కర్మనే అనుభవిస్తున్నాడుగాని దానికెవరు బాధ్యులు అనుకున్నాను. అయినా లేచి వాడికి మామూలుగా ఇచ్చే పావలా కాసు ఇచ్చి వచ్చాను. ఇహ హాయిగా నవల చదువుకుంటూ కూర్చోవచ్చు! పుస్తకం పేజీలు తిప్పుతున్నాను -

పుస్తకం అట్ట ఊడి, అందులో నుంచి ఏదో రపీమని నా ఒళ్లో పడ్డది... పది వంద రూపాయల నోట్లు! అప్రతిభురాల్నై చూస్తూ ఉండిపోయాను.

"అయ్యో షాకిరా! నాదే పొరపాటు" అనుకున్నాను. అసలా డబ్బు ఆ పుస్తకంలో ఎందుకు పెట్టాను? అంత పూర్తిగా ఎట్లా మర్చిపోయాను! షాకిరాకి కొంత అన్యాయమే జరిగింది నా వల్ల! ఎట్లుందో చూద్దామనిపించింది. రాజమ్మను వెంట తీసుకుని మొదటిసారిగా వాళ్లింటికి బయల్దేరాను. షాకిరా ఇప్పుడు తల్లి దగ్గర ఉండడం లేదు. ఎప్పుడైనా వచ్చి పలకరించి పోతుందిట. ఎక్కడుంటుందో తెలియదని వాళ్లింట్లో వాళ్లు చెప్పారు.

తిరిగి వస్తూ ఉంటే దేవాలయం దాటి రావాలి. రాజమ్మ అక్కడున్న భిక్షగాళ్లను చూపిస్తూ - 'ఇళ్లలో ఇమడలేని పేచీకోర్లు ఆఖర్న ఇక్కడ చేరతారు!' అన్నది. ఆ పేచీకోర్లను చూశాను. వాళ్లల్లో ఎక్కువ మంది ఆడవాళ్లు. ఒక్కోరి మీద రకరకాల మసిపాతలు చాల మందాన ఉన్నవి. కొందరి పక్కన ఊత కర్రలున్నవి. చాలావరకు కూర్చోలేక ముందరికి వాలబడుతూ కునుకుతున్నారు. గుళ్లో నుంచి ఎవరైనా బయటికి వస్తున్న జాడ తెలియగానే "అమ్మా! అమ్మా! అయ్యా, పైసా, ధర్మం" సత్తు గిన్నెల్లో పైసలు గలగల్లాడగా పెద్ద గగ్గోలు రేగుతుంది. మనిషి వెళ్లిపోగానే మళ్లీ మసిపాతల్లోకి అణగారిపోతారు.

"అదిగో, ఆ చివర్న కూర్చున్నది మా యత్త తోడికోడలు" అకస్మాత్తుగా అన్నది రాజమ్మ. ఆ మాట వెంటనే అర్థం కాలేదు నాకు. వీళ్లకీ బంధువులూ, కుటుంబాలూ, జీవితాలూ ఉండి ఉంటాయన్న విషయం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. వాళ్లు - వాళ్లు - మనుష్యులని ఎవరికి గుర్తు! అప్పట్నుంచీ ఎక్కడ భిక్షగాళ్ల గుంపు కనిపించినా షాకిరా కోసం చూస్తాను అప్రయత్నంగా. ఏదో అపరాధ భావం కలుగుతుంది. 'ఆవిడ కర్మకి నేను బాధ్యురాలినా? నాకేం సంబంధం?' అనుకోలేక పోయాను యీసారి. ప్రతి మనిషి జీవితానికీ బాధ్యత అందర్లోనూ వుంటుంది, అందరి బాధ్యతా ప్రతి మనిషిలోనూ వుంటుందన్న దోస్తవిస్కీ మాటలు గుర్తుకొస్తాయి. దుఃఖం అన్నది సుఖానికి వ్యతిరేక పదం కాదు, అది చాలా క్లిష్టమైనది, అది అట్టడుగున ఒంటరితనం అన్న జిడ్డు కృష్ణమూర్తి మాటలు జ్ఞాపకానికొస్తవి.

"ఏమో!" అనుకుంటాను.

మనసు నిండా ప్రశ్నలు. ఒక మనిషికీ ఇంకో మనిషికీ మధ్యన వుండగల సంబంధం ఎలాంటిది?... క్షమ అన్న మాటకు అర్థం ఏమిటి?... ప్రేమకు జన్మస్థానం ఎక్కడుంది?... సమాధానాలు తెలియటం లేదు.

★★★